


మదన్ ప్రయివేటు పూర్తి కాగానే పుస్తకాలు సంచీలోకి సర్దేశాడు.

రామ్మూర్తి చెప్పులు తొడుక్కుని గేటు దాకా నడిచి, తిరిగి వెనక్కి వచ్చాడు. లోపలకి వెళుతున్న మదన్‌ని "బాబూ.... నాన్నగారు లోపలున్నారా?" అని అడిగాడు.

"మేడమీద వున్నారండీ మాష్టారూ."

రామ్మూర్తి మేడమీదకి వెళ్ళాడు. అతడు భయపడినట్లు జనార్దనంగారు పేకాటలో లేరు. విస్కీ ఒంటరిగా రుచి చూస్తున్నారు. రామ్మూర్తికి పలకరించడానికి ధైర్యం రాలేదు. తిరిగి వెళ్ళిపోడానికి మనసూ అంగీకరించలేదు.

ప్రయివేటు జీతం అడగాలి. పెద్దమ్మాయి, పిల్లలు పండక్కి వచ్చారు. ఇంట్లో సరుకులెం లేవు. తను ఏదో తెస్తాడని నాగరత్నం, తమ దరిద్రాన్ని దాచే ప్రయత్నం చేస్తుంది.

జనార్దనంగారు మరో రౌండ్ కోసం విస్కీ గ్లాసులో వంచుతున్నారు. రామ్మూర్తి వెనకనుంచి ముందుకువచ్చాడు. పలకరించడానికి తటపటాయించాడు. ఆ నిషాలో ఆయన మాట మిగిలితే చావాలి.

"ఎవరది?" జనార్దనంగారు తల తిప్పాడు.

"నేనండి...." నెమ్మదిగా నసిగాడు రామ్మూర్తి.

"ఏం మాష్టారూ? ఏం కావాలి? చెప్పండి" కంఠంలో విసురున్నా గౌరవం పోలేదు.

రామ్మూర్తి జీతం సంగతి చెప్పాడు.

'రేపు కనిపించండి' అంటాడని రామ్మూర్తి భయపడ్డాడు. చెల్లని రూపాయికి గీతలెక్కువ. దరిద్రానికి భయాలెక్కువ. పెన్షన్ రాడానికింకా పదిరోజులు వ్యవధి వుంది.

జనార్దనంగారు కోటు జేబులో చెయ్యిపెట్టి గుప్పెడు నోట్లు బయటకి తీశాడు "తీస్కోండి" అంటూ వంద విసిరాడు.

రామ్మూర్తి గొంతు తడారిపోయింది. తన జీతం పది రూపాయలు. ఆయన వంద యిస్తున్నాడేమిటి? చిల్లర తెమ్మనా? లేక నిషాలో తెలియడంలేదా?

"నిలబడ్డారేం.... ఇచ్చాను కదా వెళ్ళి రండి."

వందతో రామ్మూర్తి బయటపడ్డాడు. మనసునిండా వందకి సరిపడ్డ కోరికలు. దరిద్రం అవసరాలబట్టి, ఆదాయంబట్టి వ్యాకోచిస్తుంది. రామ్మూర్తి పరాకుగా




నడుస్తున్నాడు. తెల్లవారక జనార్దనంగారు లెక్కపెట్టుకుంటే ఏమవుతుంది? తను దొంగయిపోడూ?

రామ్మూర్తికి మిగతా డబ్బు యిచ్చేయ బుద్ధవలేదు. పాలకేంద్రం దగ్గర నిలబడి సీరియస్‌గా ఆలోచించాడు.

రామ్మూర్తి వందనోటు మార్చివేశాడు. తిరిగి జనార్దనం గారింటికి నడుస్తూ పది నోటుమీద సిరా వలకపోశాడు. హాల్లో జనార్దనంగారి భార్య రేడియో వింటూ కూర్చుంది.

"ఇలా వచ్చారేం మాష్టారూ?"

"జనార్దనంగారు ప్రయివేటు జీతం యిచ్చారమ్మా. ఈ నోటుమీద సిరా వలికింది. ఎక్కడా మారలేదు."

"ఆయన యిప్పుడే పడుకున్నారే."

"పోనీలెండి. రేపు తీసుకుంటాను. నోటు యివ్వండి."

రామ్మూర్తి మనస్సు యిప్పుడు తేలికగా వుంది. జనార్దనం గారికి తనమీద అనుమాన మొచ్చినా నిలవదు. ఆయన భార్య తనకి డిఫెన్సు.

మర్నాడు సాయంత్రం రామ్మూర్తి కొంచెం బెదురుగా ప్రయివేటుకి వెళ్ళాడు. జనార్దనంగారు అప్పుడే కోర్టునుంచి వచ్చారు. రామ్మూర్తిని చూసి "అరె.... మాషారూ....నిన్నమీకు మంచి నోటు యివ్వలేకపోయాను. ఏమనుకోకండి" అంటూ పదినోటు అందిచ్చారు.

రామ్మూర్తి మనస్సు స్థిమితపడింది. మళ్ళ నెల తిరిగింది. రామ్మూర్తి జీతానికి వెళ్ళాడు. జనార్దనంగారు మళ్ళ నిషాలో వంద విసిరారు.

"బాగుంది ఈయనతో వ్యవహారం." రామ్మూర్తి మురిసిపోయాడు.

ఈ సారి వంద మార్చి పది రూపాయలు యివ్వడం అనవసరంగా తోచింది. ఆయన నిషాలో యిస్తున్నాడు. ఏం చేస్తున్నదీ ఆయనకి గుర్తువుండదు. వుంటే మొదటి సారి అడిగేవాడు కామా?

సరుకుల కోసం రామ్మూర్తి కిరాణా దుకాణంలో వంద నోటిచ్చాడు. "ఇది మారదండీ మధ్యన చిల్లివుంది" షావుకారు యిచ్చాడు. రామ్మూర్తి మరో నాలుగు దుకాణాలు తిరిగినా నోటు మారలేదు. గత సారి తొంభై లాభం. ఈ సారి పదీ నష్టం.

"అయ్యో.... మీరు పొరపాటున వందిచ్చారు. నా జీతం పది రూపాయలే." రామ్మూర్తి జనార్దనంగార్ని కల్సుకుని, తన జీతమైన పొందుదామని చెప్పాడు.

"పది కొట్టు తిరిగేదాకా అది పది నోటు కాదని తెలియలేధా? ఈ నిజాయితీ క్రితం సారి ఏమయింది? క్రితం సారి.. మర్నాడు లెక్కపెట్టుకుంటే వెయ్యికి తొమ్మిది వందలే వున్నాయి. అంటే వంద మీకిచ్చానన్న మాట. మీరు నిజం చెప్తారని చూస్తే. పథకం వేసుకుని వచ్చారు. మిమ్మల్ని అల్లరి పెట్టడమెందుకని వూరుకున్నాను.

ఈ సారి కూడా ఆ వంద నోటు మారక పోవడం వల్ల మీ జీతం కోసం నిజాయితీ పుట్టుకు వచ్చింది. మరో పది నెలల దాకా జీతం అడక్కండి- అదే శిక్ష మీకు...."

రామ్మూర్తి తల ఒంగిపోయింది.